అరణి

# పెళ్లి కబురు

'మనిషి సగమై పోయాడు'

— అనుకొంటాడు సీతాపతి అతన్ని చూస్తూనే! అలా వున్నాడు రమణమూర్తి.

శ్రీకాకుళం పోయే బస్సు నుండి 'దత్తివలస రోడ్డు'లో దిగాడతను. చేతిలో చిన్న సైజు బ్యాగుంది. ఉదయం నాలుగున్నరా, అయిదూ ఆ ప్రాంతం. ఇంకా తెల్లగా తెల్లారిన వాతావరణం లేదు. దూరంగా వున్న చేలూ, కొండలూ మసక మసగ్గా కన్పిస్తున్నాయి. వెనగ్గా వున్న యేటి అలల సవ్వడి — వుండివుండీ డోలక్‌ను సుతారంగా ఎవరో వాయిస్తున్నట్టుగా వుంది.

ఊరులోనికి పోయే మట్టిదారిని చూసి, "ఇదే దారా ?" రమణమూర్తి మరోసారి గొణుక్కున్నాడు. రెండడుగులు వేశాడో లేదో ఎవరో రాత్రి పెళ్లివారి వంటల గురించి మాట్లాడుకొంటూ ఏటికి పోతున్నారు. "దారి ఇదే!" ఖాయం చేసుకొన్నాడు.

చల్లగాలి వీస్తూంది. రెండ్రోజుల ప్రయాణ బడలికంతా పోయింది. కళ్లద్దాలు తీసి, ముఖాన్నంతా చేత్తో ఓసారి తుడుచుకొన్నాడు. అతనొస్తున్నట్టు టెలిగ్రాం ఇచ్చాడు — రెండ్రోజులక్రితం సీతాపతికి. అందే వుంటుంది!

గాలికి చెట్ల ఆకులు వొరుసుకొంటున్నాయి. టూరింగ్‌టాకీసు తీసేకు మీద ఆకులు పడి కొనగోటితో తాళం వేస్తున్నట్టు శబ్దిస్తున్నాయి. 'మాంగళ్యబలం' సినిమా ఆడుతోంది అందులో.

సిగరెట్‌కోసం లాల్చీ జేబులో చేయి పెడితే పెళ్లి శుభలేఖ, అక్కయ్య రాసిన వుత్తరం తగిలాయి. ఈ పెళ్లికి తనొస్తాడని అనుకోలేదు. చివరికి తెగించి ప్రయాణమయ్యాడు.

దారి ప్రక్క 'టీ' కొట్లు మేల్కొంటున్నాయి. పాలెగూళ్లలో వున్న కరెంటు దీపాలు మసిబారిన చూరుల్ని అంతగా కన్పించనీయట్లేదు.

సుమారుగా ఇరవై యేళ్ల కిందట — ఆ వూరికి ఎలక్ట్రిసిటీ లేదు. ఇప్పుడో!? దాన్తోపాటు, చాలా మార్పులొచ్చాయి. గిలకబావి నిశ్శబ్దంగా వుంది. ఎవరూ నీరు చేదుకోవడం లేదు. అప్పట్లోనే, ఎవరో అందులోపడి చనిపోయారని దాన్ని వాడటం మానేశారు మరి!

పాడుబడ్డ బావి వయసు ఇరవై యేళ్లు!

రమణమూర్తికిప్పుడు నలభై అయిదేళ్లు!?

అతనికి పెళ్ళయ్యింది పాతికేళ్లప్పుడు - అంతకు మూడేళ్ల ముందే సీతాపతి పెళ్లి చేసుకొన్నాడు.

అప్పుడూ రమణమూర్తి పెళ్లికొచ్చాడు. ఇలా ఒక్కడిగా మాత్రం కాదు. టౌన్‌లో పదిమందిని కూడగట్టుకొని సరదాగా సెక్సీ కబుర్లాడుకొంటూ టాక్సీలో దిగాడు.

ఇప్పుడు 'రమణమూర్తి' అనబడే అప్పటి 'మూర్తిగాడి'కి ఇరవై రెండేళ్లు. బి. ఏ. చదువుతుండేవాడు. చిన్నసైజు రచయిత.

బాల్య మిత్రుడు, సీతాపతికి పెళ్లంటే మూడ్రోజుల ముందుగానే ప్రోగ్రాం ఫిక్స్ చేశాడు. వాళ్లు దిగగానే తోడ్కుపోవడానికి సిద్ధంగా వున్నాడు సీతాపతి. రెండెడ్లబండి పురమాయించి వుంచాడు. అందరూ 'హాలు హాలో'మంటూ బండెక్కగానే చర్నాకోలా పట్టుకొని రమణమూర్తే రథసారథి అయ్యాడు. పూటుగావున్న ఎడ్లని పోటీపడి పరుగెత్తించాడు.

నవ్వులు, జోకులు, ఎకసెక్కాలు, ఎన్ని? ఎన్నెన్నో పెళ్లికొడుకు మీద కుమ్మరించాడు. సరదాగా సిగరెట్లు తాగాడు. అప్పటికే సీతాపతి వూరి కరణీకం చేస్తున్నాడు, కలిసిరాని చదువును ఎత్తిగట్టేసి.

కరణంబాబు పెళ్లికి వూరంతా కలివిడిగా వుంది. పెద్ద పందిరి వేశారు. పందిర్నిండా కాగితం పూలు అలంకరించారు. సీతాపతి మిత్ర బృందం వాటిని చూసి చిందులేసింది.

ముహూర్తం రాత్రి తొమ్మిది గంటలకి. శీతకాలం! వేగంగా భోజనాలు కానిస్తే మంచిదన్నారు పెద్దలు. వడ్డన కార్యక్రమంలో ముఖ్యుడయ్యాడు రమణమూర్తి. గళ్ల లుంగీ, కట్ బనీను, చేతిలో సిగరెట్‌తో పాటు మాటకారితనంవున్న అతనికి పేరిందేవి త్వరగానే పరిచయమైంది.

ఆమె వూరి మున్సబుగారి రెండో కూతురు. సీతాపతికి దగ్గర చుట్టం. సలాగ్గా, అందంగా వుంటుంది. సందడిగా మాట్లాడుతుంది. దాన్తో మిత్ర బృందానికి చర్చనీయాంశమైంది.

"ఈ అమ్మాయిని మూర్తిగాడు పెళ్లిచేసుకొంటే బాగుణ్ను" అన్నాడో మిత్రుడు.

పెళ్లి ఆలోచన రాలేదుగాని 'కాలక్షేప బఠానీ' అన్పించింది మూర్తికి. అవిూ ఆ బృందానికి చెప్పేసరికి 'వహ్వా శభాషో' అన్నారు.

పెళ్లి తంతు జరుగుతూంది. కొంగూ కొంగూ ముడివేశారు. కాలూ కాలూ మట్టించారు. ప్రమాణాలు చేయిస్తున్నారు. వీటన్నిటినీ చూసి మూర్తికి అల్లరి చేయాలన్పించింది.

''బాబోయ్! ఇంత తతంగమా? ఛస్తే పెళ్లి చేసుకోకూడదు'' అన్నాడు కావాలని పేరిందేవిని చూస్తూ. ఆమె నవ్వింది 'కాకపోతే!' అన్నట్టు.

మాంగళ్యధారణ జరిగింది. అక్షితలు దంపతుల మీద కాక, పేరిందేవి మీద జల్లాడు ఎవరూ చూడకుండా. సిగ్గు పడిందామె. చూసిన మిత్ర కూటమిలో వ్యక్తి ''మూర్తిగాడు అప్పుడే తలంబ్రాలు పోసేస్తున్నాడోయ్'' అంటూ అరిచాడు. ఆ మాటలకి పేరిందేవి లజ్జతో నజ్జు నజ్జు అయిపోయింది.

రాత్రి పదకొండయింది.

పెళ్లివారు జాతర్లో వ్యక్తుల్లా ఎక్కడ పడితే అక్కడ పడుకొన్నారు. స్నేహితులంతా ఓచోట చేరి సీతాపతితో కబుర్లాడుకొంటున్నారు ఇవతల. మర్నాడు వంటలకి శుచిగా నీళ్లు కావాలి! నలుగురైదుగురు ఆడవాళ్లు యేటికి పోవడానికి చంకని బిందెలు ఎత్తుకొన్నారు.

''ఎవరైనా మగసాయం వస్తే బాగుణ్ను'' అంటూంది పేరిందేవి పెరట్లోంచి ఇవతలకి చూస్తూ.

''ఎందుకులెద్దూ'' అందో పెద్ద ముత్తైదువు.

''బాగుండర్రా! వుండొద్దూ'' అన్నాడు రమణమూర్తి, చొరవ చేస్తూ. కాదనలేదెవరూ. దారిలో రమణమూర్తిని గురించి మిగతా ఆడ జనం చాలా ప్రశ్నలు వేశారు. అన్నిటికీ ఓపిగ్గా సమాధాన మిచ్చాడు.

నాలుగైదుసార్లు యేటికీ, ఇంటికీ తిరగడంతో పేరిందేవి చాలా మాట్లాడింది రమణమూర్తితో.

''మీరు కథలాస్తారా?!'' అంది.

''నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోండని'' సలహా కూడ ఇచ్చింది. అంతే!

''నమో వేంకటేశ! నమో తిరుమలేశ! నమస్తే! నమస్తే నమః' అంటూ అరిగిపోయిన గ్రాంఫోన్ రికార్డు బెక్కుతూ విన్పిస్తూంది. పెళ్లి వారింటికి దగ్గర పడ్డాననుకొన్నాడు రమణమూర్తి. మరో ఏడేడడుగులు అనుకొన్నాడు.

సీతాపతి పెళ్లికొచ్చిన స్నేహితులంతా ఈ పెళ్లికొస్తారు.

ఆ రోజు —

''ఒరే మన పెళ్లిళ్లకు మనం కలసినా, కలవకపోయినా, మన పిల్లల పెళ్లిళ్లకుమాత్రం తప్పకుండా అందరం కలుసుకొందాం. అన్ని విధాలా మనకి అప్పుడు బలగం అవసరం'' అనుకొన్నారందరూ

మొదటిగా సీతాపతి కూతురికే పెళ్లవుతూంది. కాలం కలిసొస్తే రమణమూర్తీ తన కూతురికి పెళ్లి చేయబోతున్నాడు. కాని, కాలం కలసి రావట్లేదు. లేకపోతే ఈ పెళ్ళికి తనొచ్చేవాడేకాదు.

తన కూతుర్ని కోడలుగా చేసుకోమని అక్కయ్యకి వుత్తరం రాస్తే — 'వాడింకా చదువుకొంటాననంటున్నాడ్రా! అయినా ఇప్పట్నుంచీ పెళ్లేమిటి చెప్పూ' అని వుత్తరం రాసింది, వారం రోజులకిందట. అంటే పరోక్షంగా 'నా కిష్టం లేదు' అన్నట్టు.

ఉన్న ఆశ ఎగిరిపోయింది. భయంపట్టుకొంది. పిచ్చి ఆలోచనలు రేగాయి. కాసిన్ని రోజులు వాట్నుంచీ తప్పించుకోవాలనుకొన్నాడు. అసలు విషయాన్ని కప్పిపుచ్చి ''అక్కయ్య దగ్గరికి వెళ్తున్నాను, తాడోపేడో తేల్చుకుంటాను'' అని భార్యకి నచ్చజెప్పి, ఇలా వచ్చాడు. పదిమందినీ కలిస్తే పది కబుర్లు, పది కార్యాలూ అన్నారు పెద్దలు! ఎవడి కొడుకునో ముడివేసుకోవచ్చు! లేదా ఎవడో ఎవణ్నో చూపించొచ్చు! అంతా కట్టుకొన్నదాని, కన్నదాని అదృష్టం! అందరికందరూ చుట్టుపక్కలే వున్నారు. అతనొక్కడే అంత దూరం తుళ్లిపోయింది.

అనుకొన్నట్టుగానే రమణమూర్తిని చూసి సీతాపతి ఆశ్చర్యపోయాడు. ''ఏరా? ఇలా?!'' అన్నాడు మనిషిని చూసి పెదవి విరుస్తూ.

పెళ్లి కళ అక్కడి ప్రదేశమంతా నిండుంది. అమ్మాయిలు, అబ్బాయిలూ హడావుడిగా తిరుగుతున్నారు. ఎవరెవరు ఎవరివాళ్లో!? అందర్నీ చూస్తున్నాడు తనకు తెలిసిన మొహం కన్పిస్తుందేమోనని రమణమూర్తి. అబ్బే లేదు! మనుషులు పోల్చుకోలేనంతగా మారిపోయారా? లేక, ఇంకెవరూ దిగిరాలేదా?!

''పదపద స్నానం చేద్దూగాని'' తొందర చేశాడు సీతాపతి.

*   *   *

పెళ్లి సందడి ముగిసింది.

శోభనం — ఆ కార్యం గంటక్రితం జరిగిపోయింది. పెరట్లో పెద్ద పొయ్యిమీద చలిమిడి కలియబెడ్తున్నారు ఆడాళ్లు. ''మగపెళ్లివారికి ఫలహారాలు సరిగ్గా అందలేదట'' అన్నమాటకి ''నాగవిల్లి బాజా వాయించేసినానా''అంటూ వాళ్లల్లో వాళ్లే నవ్వుకొంటున్నారు.

మిద్దె ఇంటిని డాబా చేశాడు సీతాపతి. దాని మీద కూర్చున్నారు మిత్రులిద్దరూ. పెరడు, పక్కన పొలం గట్లూ అన్నీ కన్పిస్తున్నాయి. వాటిమీద జంటలుగా మూడు జట్లు తేమ తేమ వెన్నెలలో కూర్చుని కబుర్లాడుకొంటున్నాయి. స్పష్టంగా అవేవీ వినబడటం లేదు.

"కూతురి పెళ్లి అయిందనిపించావు" అన్నాడు రమణమూర్తి.

"ఏదో" పెద్దగా నిట్టూర్చాడు సీతాపతి.

లోలోపల తొలుస్తూన్న బాధ బయటకు రాలేకపోతోంది. అడగలేక వుండలేకపోతున్నాడు రమణమూర్తి.

"మన వాళ్లెవరూ రాలేదేందుకురా ?!" అడిగాడు చిట్ట చివరికి.

అదేం పెద్ద ప్రశ్న కాదన్నట్టుగా -- "రాలేకపోయారు. పనుల మీద వున్నారు కామోను" సీతాపతి అన్నాడు.

"ఏం పన్లులేరా ?"

"అలా అనకు ! పెద్ద రామ్మూర్తి కొడుక్కేం బాగాలేదు. పుట్టుకే అల్పంగా పుట్టాడు. పదిహేనేళ్లొచ్చినా ఆ గుంటడు రేపో, మాపో అన్నట్టుగా వున్నాడు. కొడుకుని పట్టుకొని చికిత్సకోసం వాడు తిరగని వూరంటూ లేకపోతూంది."

"మరి చిన్నరామ్మూర్తి !?"

"ఉన్న ఎకరంన్నరా మడిచెక్క కోసం అన్నతో తన్నుకు చస్తున్నాడు. పెద్దరామ్మూర్తి కంబారి మొన్న మడిమీదే వాడి కాలు విరగ్గొట్టేశాడు."

"నిజం !" అదిరిపడ్డాడు రమణమూర్తి.

"సత్తెంగ్గాడా ! వాణ్ణి చూడాలని వుంది" రమణమూర్తి గొంతులోని ఆప్యాయతని కనిపెట్టాడు సీతాపతి. చెప్పలేకచెప్పున్నట్టు చెప్పుకొచ్చాడు.

"వాణ్ణి కాల్చిపారేశారు గుమ్మలక్ష్మీపురం అడవుల్లో. నక్సలైటట !"

ఆ విషయం తెలియకపోవడం, తెలుసుకోకపోవడం తన తప్పున్నట్టుగా విలవిల్లాడాడు రమణమూర్తి.

ఇంకేం విషయాలున్నాయి తెలుసుకొందికి. విషాదాంతాలు తెలుసుకోవడం బాధగా వుంది. గుండెను కెలికేస్తున్నట్టుగా వుంది. చాలాసేపు నిశ్శబ్దంగా కూర్చున్నాడు. సీతాపతి పెళ్లికబుర్లలో పడ్డాడు. తనీ సంబంధం ఎలా వెతికిందీ, ఎంత కట్నానికి పెళ్లి కొడుకుని కొన్నదీ, దానికి మూలమైన మున్సబుగారి బంధువులూ, వాళ్ల గురించి చెప్పుకొస్తున్నాడు.

మున్సబుగారంటే పేరిందేవి గుర్తుకొచ్చింది రమణమూర్తికి. ఏడుపులో నవ్వులా ఆమెనుగూర్చి అడగటం సరదా అన్పించింది. అడిగాడు.

"మూళ్లేదా నువ్వు" అన్నాడు సీతాపతి.

"లేదు, పెళ్లికొచ్చిందా ?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"రాకపోవడమేమిటి ! నిన్ను చూపించి రమణమూర్తి కదూ అంటూ నన్ను అడిగింది కూడా."

"కులాసాగా వుందా ?"

"ఏం కులాసా ! ముక్కూ మొఖం తెలీని మిలట్రీవాడికి కట్టబెట్టారు దీన్ని. వాడా యుద్ధంలో చచ్చారుకొన్నాడు. వెంటనే ఇదో కొడుకును కనేసి జీవితంలో నిలబడిపోయింది. కొడుక్కి పట్నంలో మందుల షాపుంది దాన్ని పట్టుకుబతుకుతున్నారిద్దరూ."

అంటే ! —

పేరిందేవి కుమారీకాక, శ్రీమతీకాక, గంగా భగీరథీ సమానురాలా !? ఇప్పుడామెను పలుకరించాలంటే పుణ్యనదీనదాలు ఆమె కళ్లల్లోనివి చూడాలా ? ! క్షణంసేపు స్థిరంగా కూర్చోలేకపోయాడు రమణమూర్తి. నిశ్శబ్దంగా లేచి నిల్చున్నాడు ప్రసంగం చాలన్నట్టుగా. సీతాపతి కూడా ఆపేశాడు అంతటితో.

"నచ్చిన అమ్మాయిని పెళ్లిచేసుకొండి" అంది పేరిందేవి.

నచ్చిన అమ్మాయినే చేసుకొన్నాడు. కాని, పేరిందేవి అంతగా నచ్చలేదు. నాలుగు వేలు కట్నం కూడ పుచ్చుకొన్నాడు. కట్నానికి ఆశపడి పేరిందేవిని 'కాలక్షేప బఠానీ' అనుకొన్నాడే కాని, కలకాలం హృదయాన్ని స్పందింపజేసే 'ఆడది' అనుకోలేకపోయాడు. దురదృష్ట వంతుడు !

అప్పటికీ ఇప్పటికీ ఎంత వ్యత్యాసం ? పేరిందేవిని తను పోల్చుకొనలేకపోయాడు.

సీతాపతి పదిహేను వేలు కూతురికి కట్నంగా ఇచ్చాట్ట ! ఎంత దారుణం !

పేరిందేవిని రేపు పరామర్శించాలి !

పెళ్లి కబురడగాలి !

తన కూతురికి నచ్చడం, నచ్చకపోవడం అంటూలేదు. ఆమె కొడుక్కి తన కూతురు నచ్చితే చాలు !!

చాలు గాక చాలు ! !

—ఆలోచిస్తున్నాడు రమణమూర్తి.

వెన్నెల చంద్రుణ్ణి మబ్బు వాటేసుకొంది. లీలగా చీకటి అలముకొంది. తక్కువ కట్నానికి కుదరకపోతాడా అని రమణమూర్తి ఆలోచన్లని పేరిందేవి కొడుకు సంధించి లాగుతున్నాడు.

పెరట్లో చలివిడి ముద్దలు తయారయ్యాయి.

'తల్లిముద్ద ! పిల్లముద్ద!' అని వేరుచేస్తున్నారు అరిందలు.